# దాసి తల్లి

– దాట్ల దేవదానం రాజు

"నల్లని ఆకారం..ఆ బోదకాలు..ఛీ! అసహ్యం".

'ఒట్టి నోటి దురుసు మనిషి".

"తిట్లకు వెనుకా ముందూ చూడదు...పొగరుగత్తె".

"దాని గొంతు వింటేనే కంపరం నానా కాలంలో బోదురు కప్ప మాదిరి".

"దాని మొహానికి చుట్టొకటి – పైగా అడ్డపొగ".

మా పనిమనిషి గంగి గురించి కుర్రాళ్ళు అను కునే మాటలివి. నాకైతే గంగి అంటే ఎంతో ఇష్టం. నాకోసం బతుకుతున్నట్టే వుండేది. కంటికి రెప్పలా చూసుకునేది. నా సావాసగాళ్ళు దూరంగా గంగిని చూస్తే చాలు పారిపోయేవాళ్ళు. అందరూ గయ్యాళి గంగి అని పిలిచేవారు.

మా అమ్మయితే ఎప్పుడూ పూజా పునస్కారా లతో వుండేది. నిత్యం ఇల్లంతా కడుగుళ్ళూ, ముగ్గులూ. ఓపిక లేకపోయినా శుభ్రం లేకపోతే ఒప్పుకునేది కాదు. మా అమ్మకు ఒక్కణ్ణే సంతానం కావడం చేత అమ్మ గారాబం, గంగి ప్రేమల మధ్య నలిగిపోయేవాడిని.

బయటకు ఆటలకు అస్సలు పంపేది కాదు అమ్మ. కట్టడుల నుంచి ఎపుడైనా వెసులుబాటు కల్పించి తోటి పిల్లలతో కలవడానికి గంగి కొండంత అండగా వుండేది.

బడికి వెళ్ళనని మారాం చేసినపుడు గంగి నా వెనకాలే వుండేది. "ముండా నదువులు నదివేత్తేనే గాని బతకలేకపోతాడా..బాబు" అంటూ భరోసా ఇచ్చేది.

ఇంటి ముందర రోడ్డుకు అటువైపు జమ్మి చెట్టుంది. ఆ జమ్మి చెట్టంటే గంగికి ప్రాణం. ఆ చెట్టును ఎంతో భక్తిభావంతో చూసేది. ఊళ్ళే జనం రోడ్డు మీద ఎడమ వైపుగా వెళ్ళేవారు వచ్చేటప్పుడు చెట్టును చుట్టి వచ్చేవారు. అట్లా చేయడం వల్ల చెట్టుకు ప్రదక్షిణ చేసినట్టయ్యేది. ఎవరైనా కొత్తవాళ్ళు తెలియక రోడ్డు మీదుగ్గా రాబోతుంటే వారించి తిరిగి వెళ్ళమని చెప్పేది. అలా చెప్పి చేయించడం కూడా పుణ్యకార్యంగా తలచేది. నన్ను తన కూడా చెట్టు చుట్టూ తిప్పి ఏవో ప్రార్థనలు చేసేది. నాకే ఆపదా రాకూడదని కోరేది.

ఎపుడైనా గుడి ఆవరణలోకి ఆటల కోసం వెళ్ళేవాడిని: అక్కడ పిల్లలతో గొడవ పడినపుడు ఏడ్చేవాడిని. గంగికి ఎట్లా వినిపించేదో వెంటనే ప్రత్యక్షమయ్యేది. అంతే! పిల్లలంతా కాలికి బుద్ధి చెప్పేవారు.

పొద్దుటే గంగి నన్ను వీపుపై పడుకోబెట్టుకుని చీపురుతో గదుల్ని తుడిచేది. "మహాజనులారా.." అంటూ ఏదో అర్థం కానట్టు పాడేది. బల్లిలా కరుచుకుని గదులన్నీ పూర్తయ్యేవరకు అట్లాగే పడుకుని వుండేవాడిని.

తలంటు స్నానం చేయడానికి గంగిని నానా తిప్పలు పెట్టేవాడిని. తులసి కోట చుట్టూ పరు గెత్తించేవాడిని. వెనుక నుంచి తేరుముకుంటూ వచ్చేది. 'ఆయాసంతో చచ్చిపోతున్నాను బాబో' అంటూ కూలబడేది. కాసేపు అలాగే పడిపోయి వుండేది. నాకు భయం వేసేది. ఏమైందోనని దగ్గరకెళ్తే 'దొరికావులే దొంగ' అంటూ పట్టుకు నేది. ఇక విడిచిపెట్టేది కాదు. పెరట్లో నీళ్ళ పొయ్యి దగ్గరకు లాక్కుని పోయేది. చిన్న పీట వేసి కూర్చోబెట్టేది. పొయ్యిలోకి కట్టెల్ని ఎగ దోస్తూ వుండేవాడ్ని. అగ్గి మీంచి అరచేతులకు కాక పట్టించుకుని కాళ్ళకు వేడి అంటించేవాడ్ని.



నేవలా ఆటలో మునిగి వుండగానే తలస్నానం పూర్తయ్యేది.

ఇంట్లో తాటి తాండ్ర చేయరు. నాకెంతో ఇష్టం అది. అమ్మ వాటిని తినకూడదని అది అలగా తిండని చెప్పేది. వాటి రుచి మొదటిసారిగా గంగి ద్వారానే తెలిసింది. తమంటున్న కొంపల్లో ఎవర్నో అడిగి తీసుకొచ్చేది. చెంగు చాటున దాచి తెచ్చేది. ఎవరూ చూడకుండా నెమ్మదిగా నా దగ్గరకు వచ్చేది. విచిత్రమైన సైగ చేసి కళ్ళు మిటకరించేది. నాకు అర్థమయ్యేది గంగి నాకిష్టమైందేదో తీసుకొచ్చిందని. తాటి తాండ్ర కాగితంలో చుట్టి ఇచ్చేది. ఒక పక్క అమ్మ చూస్తుందేమోనని భయం. చొక్కా లోపల పొట్ట దగ్గర పెట్టేవాడిని. ఒకసారి అమ్మ చూసి పెద్ద రాద్ధాంతం చేసింది. "ఒసేయ్ గంగీ! నీకెన్నిసార్లు చెప్పినా బుద్ధి రాదు. కాని తిండ్లు పిల్లాడికి పెట్టొద్దంటే వినవు. అవక జబ్బు చేస్తే బాధపడాల్సింది మేమే కదా!" అని నిష్ఠూరంగా అమ్మ అడిగేది.

గంగి సమాధానం చెప్పేది.

"బాబు కిష్టమని తెచ్చాను. ఇంతట్లోకి ఏమవ్వదులేమ్మా! ఎంత తింటాడేమిటి? ఏదో బ్రమ!"

"ఏమైనా సరే! అలా తీసుకొచ్చి పెట్టకు. ఎదవ తిండ్లు మప్పితే వేమారుకునేది లేదు" కోపంతో అమ్మ అనేది.

"తాటి తాండ్రంటే నోట్లో నాలుక మడత అంతే" ముసి ముసిగా నవ్వుతూ గంగి అనేది.

ఒకోసారి గంగి ఏ పనీ ముట్టుకోకుండా పెరట్లో చింత చెట్టు మానుని ఆనుకుని వుండిపోయేది. గత జ్ఞాపకాల్లో మునిగిపోయేది. పెళ్ళయిన తర్వాత కోటనందూరు వెళ్ళడం, భర్తతో మూన్నాళ్ళ ముచ్చటైన కాపురం, మొగుడి చావు, మళ్ళీ పుట్టింటికి, ఇక్కడకు చేరడం గుర్తు చేసుకునేది. నేను వెళ్ళి కదిపితే స్వప్నలోకొచ్చి అన్నీ చెప్పేది. ఆలోపులో అమ్మ కేకలు పెట్టేది. గంగి ఒక పట్టాన కదిలేది కాదు.

'గంగీ! నీకు చెవుడు కూడా దాపురించిందా? ఇలా అయితే లాభం లేదు. పని మానెయ్యి. ఇంకెవరినైనా పెట్టుకుంటా. నీకు నాతో కుదరదు. నీవిక చేయలేవు. మానేసి పుణ్యం కట్టుకో" అమ్మ గట్టిగానే అనేది. గంగి రోషంగా చూసేది.

"సరే! ఈ ఇంటి మంచి పోతా! ఏ దొంగ కూతుర్నూ నా బట్ట వత్తాదో పని చెయ్యడానికి? కాళ్ళు ఇరగ్గొడ్తాను. పాతికేళ్ళ మంచి సేత్తున్నాను. రమ్మనండి, ఏ గుడిసేటిది వత్తుందో సూత్తాను. నా బొందిలో పాణం వుండేంత వరకూ ఇక్కడే వుంటాను" గంగి ఆవేశంతో అనేది.

ఇక యుద్ధం జరిగేలా వుందని భయంగా దూరంగా నిలబడి చూసేవాడ్ని.

'ఇలా అయితే ఎలాగ గంగీ! పని చేయలేనప్పుడు మార్గాంతరం ఆలోచించాలి కదా మరి!" అమ్మ కొద్దిగా తగ్గి అనేది.

"బాబుకు పెళ్ళవ్వాలి. పిల్లలు వుట్టాలి. వాళ్ళకి తానాలు నేనే చేయించాలి. ఎత్తుకు తిప్పాలి. అవుడే ఇక్కణ్ణించి వెళ్ళేది. అప్పటి వరకు అరి చెమ్మాదులు వచ్చినా కదిలేది లేదు" నిక్కచ్చిగా చెప్పేది.

అమ్మ నిస్సహాయంగా చూస్తూ వుండిపోయేది, 'లోలోపల ఈ శని ఎప్పుడొదుల్తుందో!' అనుకుంటూ.

*** *** ***

ఆ రోజు బాగా జ్ఞాపకం. ఉదయం తొమ్మిది అయ్యేటప్పటికి నాన్న చిందులు వేస్తున్నాడు. తను పడుకునే పరుపు కింద పెట్టిన సొమ్ము మాయమైందట. పొద్దుటే తీయొచ్చు కదాని వేయి రూపాయిలు అక్కడ దాచాడట. గదిలోకి ఎవరెవరు వచ్చారో ఆరాకి మొదలుపెట్టారు.

"సాయంకాలం లోగా దొంగెవరో తెలుసుకుని తీరతాను. పక్కూరి మూర్తి గారి దగ్గరకెళ్తాను. ఆయన ఇలాంటి దొంగతనాలు జంత్రీ వేసి ఎవరు చేశారో ఇట్టే చెప్పేస్తారు" అంటూ నాన్న బట్టలేసుకుని ప్రయాణమయ్యారు.

సొమ్ము ఎలా అదృశ్యమైందో అర్థం కాకుండా వుంది. గంగి కూడా మా విచారంలో పాలు పంచుకుంది. దొంగని తనదైన భాషలో తిట్టింది.

పదకొండయ్యేటప్పటికి నాన్న వచ్చేశారు.

"మూర్తి గారు చక్రం వేశారు. తేలిందేమిటంటే సొమ్ము ఇంట్లో వారి వల్లే మాయమైందట! పరాయి వాళ్లెవ్వరూ ముట్టుకోలేదట! ఇప్పటికీ ఇంట్లోనే ఏదో మూలన దాచి వుంచారట!" అంటూ నాన్న విషయం చెప్పారు.

"మొన్నామధ్య ఆ మూర్తి గారింట్లో దొంగతనం జరిగినప్పుడు ఏం చేశాడాయన? గుడ్లు తేలేశాడు. తెలుసుకోగలిగాడా? అంతా మన చాదస్తం. అడ్డీ బడీగా ఏవో లెక్కలు కట్టేసి నోటికేది వస్తే అది వాగేస్తారు. ఆయన్ని నమ్మి ఇంట్లో వాళ్ళ మీద అనుమానం పెట్టుకోకండి బాబూ" గంగి తేల్గ్గా కొట్టిపారేసింది.

"ఎవరు తీసినా సాయంకాలం లోపు ఇంట్లో ఎక్కడో దిక్కున గప్ చుప్‌గా పెట్టేయండి. ఎవరు చేశారో అనవసరం. సొమ్ము మనకు చేరడం ముఖ్యం. అలా జరుగని పక్షంలో పోలీసు కంప్లెయింట్ ఇస్తాను".

అమ్మ నాన్నల చూపు గంగి మీద పడింది. చాలా ఏళ్ళుగా నమ్మకంగా సేవ చేస్తున్న గంగిని అనుమానించడం దారుణం అనిపించింది. నెమ్మదిగా గంగి దగ్గరకు చేరి 'ఎవరు చేశారంటావు" అని అడిగాను.

"ఏ కట్టె కాల్తే అదే బూడిదవుతుంది. సరే చూద్దాం ఏమవుతుందో" అని తన పనిలో పడిపోయింది.

సాయంత్రం అయ్యేటప్పటికి నాన్న ధోరణి మారిపోయింది. ఎవరు బతిమాలినా భోజనం చేయలేదు. అవసరమై తెచ్చిన సొమ్ము పోవడంతో డీలాపడిపోయారు. దిగులుగా మంచమెక్కేసి ఆలోచనల్లో పడ్డారు. డబ్బు విలువ అటుంచి ఈ ఇంట్లో అలా జరిగినందుకే ఎక్కువగా బాధపడ్డారు. అమ్మ గంగి ఎంత మొత్తుకున్నా భోజనం చేయలేదు. అన్నం సయించడం లేదన్నారంతే.

ఉదయం లేచేటప్పటికి ఎవరి పనుల్లో వారున్నారు. నాన్నయితే మరీ హుషారుగా వున్నారు. అలమరాలో పుస్తకం అడుగున సొమ్ము దొరికిందట! సంవత్సరం తర్వాత గానీ అసలు విషయం తెలియలేదు నాకు. నాన్న బాధ చూసి గంగి తను దాచుకున్న సొమ్ము అక్కడ పెట్టిందట. తనే చెప్పింది నాకు. కాసుల పేరు చేయించుకుందామని దాచుకున్న డబ్బు లోంచి తీసి పెట్టిందట. ఇంట్లో వాళ్ళ మీద గంగి ప్రేమ అటువంటిది. ఆ దొంగతనం మిస్టరీ ఇప్పటికీ వీడలేదు. కాకపోతే తర్వాత కాలంలో కొంచెం ఆలస్యంగానైనా గంగి కాసులపేరు చేయించుకోవడం నాకెంతో ఆనందం కలిగించింది.

*** *** ***

నాకు ఇరవై ఏళ్ళు వచ్చేటప్పటికి గంగి బాగా ముసలిదైపోయింది. అయినా మా ఇంటికి రావడం మానలేదు. అకస్మాత్తుగా నాకు గుండె పోటు వచ్చింది. అమ్మా నాన్నా కంగారుపడిపోయారు. కాకినాడ తీసుకెళ్తున్నప్పుడు గంగి నిస్తేజంగా వుండిపోయింది. అమ్మకు ధైర్యం చెప్పింది. నాకు నయమవ్వాలని ఊళ్ళో అమ్మ వారికి మొక్కింది.

కాకినాడలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇరవై రోజుల వరకు అక్కడే వున్నాను. చాలా డబ్బు ఖర్చయి వుంటుంది. నాన్న ఎలాగో సంపాదించారు. జబ్బు నయమై తిరిగి వచ్చాను.

ఇంటికి రాగానే గంగి గురించి అడిగాను. అమ్మ బదులు చెప్పకుండా కన్నీళ్ళు కక్కుకుంది. నాన్న ఆకాశంలోకి చూస్తుండిపోయారు. నెమ్మదిగా విషయమంతా చెప్పారు. ఆస్పత్రిలో చేర్పించిన మర్నాడు నాన్న ఇంటికి రాగానే తన తెల్ల వెంట్రుక తీసి నా తలలో వేయమని చెప్పిందట. నాన్న వినుకున్నారట.

"నా మాటను బాబూ! నేను బతికినన్నేళ్ళు బాబు బతకాలి" అని బలవంతపెట్టిందట. తర్వాత పది రోజులకు గంగి చనిపోయిందట. తన తెల్ల వెంట్రుక సాక్షిగా బతికి బట్టకట్టి పది కాలాలు జీవించాలని నా దాసి తల్లి అభిలాష. మోజుపడి చేయించుకున్న కాసులపేరు అమ్మి వైద్యం చేయించమని పట్టుబట్టి నా ప్రాణం కాపాడింది. నాకసలు ఈ విషయం చెప్పొద్దని ఒట్టు వేయించుకున్న సంగతి ఎంతో కాలం రహస్యంగా వుండలేదు.